సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

క్లుప్తంగా

ఘనంగా అక్షరాభ్యాసం



చిన్నారితో అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకుడు వంశీ

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో గురువారం ఘనంగా అక్షరాభ్యాస వేడుకలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో అర్చకుడు వంశీ సర్వస్వతి పూజలు చేసి పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

కరాటే క్రీడాకారులకు బెల్ట్‌లు, సర్టిఫికెట్ల బహూకరణ



సర్టిఫికెట్ అందిస్తున్న పేడాడ రమణికుమారి

మర్రిపాలెం: మర్రిపాలెం రైల్వే స్కూల్‌లో గురువారం వాడొ-కాయ్ కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. 200 మంది కరాటే విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్య అతిథులు వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి, ఆంధ్రా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ హెడ్ అండ్ డైరెక్టర్ ఎన్.విజయ్ మోహన్ చేతుల మీదుగా టెస్ట్‌లో పాల్గొన్న క్రీడాకారులకు బెల్ట్‌లు, సర్టిఫికెట్లను బహూకరించారు. కార్యక్రమంలో చీఫ్ ఎగ్జామినర్ సతీష్‌కుమార్, నూకరాజు, కె.శివగణేష్, బి.శ్రీనివాసరావు, కె.రాము తదితరులు పాల్గొన్నారు.

30న శ్రీరామ నవమి వేడుకలు



కలశాలతో ఈవో శేఖర్‌బాబు, ఆలయ కమిటీ ప్రతినిధులు

సీతమ్మధార: శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఈ నెల 30న నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకుడు రాజా స్వామి తెలిపారు. గురువారం ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆరోజు ఉదయం 10 గంటలకు కల్యాణం, అనంతరం అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. సాయంత్రం 4 గంటలకు సాయిబాబాను 1008 క్షీర కలశాలతో సీతమ్మధారలో ఊరేగిస్తామని చెప్పారు. భక్తులు పాల్గొని స్వామి ఆశీస్సులు పొందాలని కోరారు. ఆలయ చైర్మన్, కమిటీ, కార్యనిర్వహణాధికారి పైలా శేఖర్‌బాబు, సిబ్బంది శివ, భక్తులు ఆలయంలో కలశాలు ప్రదర్శించారు.

బుల్లయ్య కాలేజీలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మధుకుమార్

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రారంభమవుతున్న సందర్భంగా గురువారం కాలేజీ సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ సంబంధిత పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో గత నెలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కోర్సు క్యాంప్ నిర్వహించామన్నారు. ఈ క్యాంపులో వివిధ కళాశాలల అధ్యాపకులు, బుల్లయ్య కాలేజీ లెక్చరర్లు పాల్గొని కోర్సును పూర్తి చేశారని తెలిపారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అందంగా గ్రీన్‌బెల్ట్‌లు.. అద్దంలా రహదారులు



ఆర్ అండ్ బీ జంక్షన్ గ్రీన్‌బెల్ట్‌లో నిర్వహిస్తున్న పనులు

- ఆర్ అండ్ బీ జంక్షన్‌లో చకచకా అభివృద్ధి పనులు
- అధికారుల నిరంతర పర్యవేక్షణ



ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద ఆధునికీకరించిన జాతీయ రహదారి

మర్రిపాలెం: ఆహ్లాదకరమైన వాతావరణానికి చిరునామా విశాఖ. నిత్యం వేలాది మంది సందర్శకులు ఇక్కడికి వస్తుంటారు. నగరంలోని అందమైన బీచ్‌లు, పర్యాటక ప్రదేశాలు, పార్కుల్లో పర్యటించి తమ జ్ఞాపకాలను భద్రపరచుకుంటారు. అంతలా రూపాంతరం చెందిన విశాఖ నేడు.. ప్రపంచ సదస్సులకు వేదికగా నిలుస్తోంది. ఇటీవల జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ కోసం ప్రపంచ దేశాల ప్రతినిధులు నగరానికి విచ్చేసిన సంగతి తెలిసిందే. ఈ నెల 28, 29 తేదీల్లో జరగనున్న జీ20 సదస్సుకు ఇంకా సుందరంగా నగరం ముస్తాబవుతుంది. అందులో భాగంగా ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అక్కడి ఫుట్‌పాత్‌లకు కొత్త టైల్స్, 40 ఫీట్ రోడ్డు పనులు చకచకా జరిగిపోతున్నాయి. ఎప్పటికప్పుడు జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఈ ప్రాంతంలో పర్యటించి పనులను పరిశీలిస్తున్నారు. జీవీఎంసీ ఈఈ, చీఫ్ ఇంజినీర్, ఏఈలు కూడా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ దగ్గరుండి పనులు చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో 2000 చదరపు గజాల్లో ఉన్న గ్రీన్‌బెల్ట్ అభివృద్ధికి రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న గ్రీన్‌జోన్‌లకు ఒక పక్క పార్కు.. మరో పక్క వాకింగ్ ట్రాక్ పనులు చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. జాతీయ రహదారిలో ఆర్ అండ్ బీ కూడలి నుంచి తాటిచెట్లపాలెం వెంబడి దాదాపు అంతటా పనులు జరుగుతున్నాయని, కొన్ని చోట్ల పార్కులు, కొన్ని చోట్ల వాకింగ్ ట్రాక్‌లు, మరి కొన్ని చోట ఇప్పటికే ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు.

స్కాడా మానటరింగ్

ఆర్ అండ్ బీ జంక్షన్‌లోని ఓ కల్యాణ మండపంలో స్కాడా వాటర్ సిస్టంను ఏర్పాటు చేశామని అధికారులు చెప్పారు. దాని ద్వారా పరిసర ప్రాంత్రాల్లోని ఇళ్లకు సంబంధించి నీటి సరఫరా ఎలా జరుగుతుంది, ఎంతమంది ఉపయోగించుకుంటున్నారు, నీటి సరఫరా సరిపోతుందా లేదా, ఏ ప్రాంతంలో ఎంత నీరు వృథా అవుతోంది అనేది మానిటరింగ్ చేస్తున్నారు. గ్రీన్‌బెల్ట్‌లో పనులు ఎలా జరుగుతున్నాయి అన్నది ఇక్కడ డెమోలో కనిపిస్తుంది.

స్థానికుల హర్షం

గ్రీన్‌బెల్ట్‌ల అభివృద్ధి, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటు, రహదారుల సుందరీకరణపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంటికి దగ్గరలో వ్యాయామం చేసుకోవడానికి వీలుగా ఉండి, సమయం కలిసి వస్తుందని చెబుతున్నారు. గ్రీన్‌బెల్ట్‌కు ఆనుకుని రోడ్డు వేస్తున్నారు. పలు చోట్ల నిర్మిస్తున్న అప్రోచ్ రోడ్ల పనులకు రూ.19.54 లక్షలు మంజూరైనట్టు వర్క్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మెరుస్తున్న జాతీయ రహదారి

జాతీయ రహదారి మెరిసిపోతోంది. జీ 20 సదస్సు, నగర సుందరీకరణలో భాగంగా ఆర్ అండ్ బీ జంక్షన్ నుంచి బిర్లా కూడలి వరకు రోడ్డు పనులు జరుగుతున్న నేపథ్యంలో గురువారం రోడ్డు మెరుస్తూ కనిపించింది. హైవేను ఆధునికీకరించడంతో వాహన చోదకులు సాఫీగా ప్రయాణం సాగించేస్తున్నారు. డివైడర్లకు రంగులు అద్దుతున్నారు. మొక్కలు నాటుతున్నారు. దీంతో హైవే ప్రాంతమంతా పచ్చదనంతో నిండి ఆహ్లాదకరంగా మారింది. రహదారుల సుందరీకరణపై స్థానికులు, వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో జరుగుతున్న ఎల్ షేప్ రోడ్డు నిర్మాణ పనులు

వాకింగ్ ట్రాక్‌లు ఉపయోగకరం



గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం శుభ పరిణామం. అందులో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, పార్కులను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకుంటారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి బాగా జరుగుతోంది.

– జి.శంకరరావు, మర్రిపాలెం

వేగవంతంగా పనులు



రూ.20 లక్షల నిధులతో హైవేలో గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. భవిష్యత్తులో కాలుష్యం లేకుండా గ్రీన్‌బెల్ట్‌లు ఉపయోగపడతాయి. ప్రజలకు అందుబాటులో పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు అభివృద్ధి చేస్తున్నాం.

– రామకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్, జీవీఎంసీ

ప్రశాంతంగా ఇంటర్ సెకండియర్ పరీక్షలు



బీవీకే కళాశాల వద్ద విద్యార్థుల సందడి



బుల్లయ్య కళాశాల వద్ద హాల్ టికెట్ నంబర్ చూస్తున్న విద్యార్థులు

సీతంపేట: ఇంటర్మీడియట్ సెకండియర్ ఫైనల్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉత్తర నియోజకవర్గంలోని పలు కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు ఉదయం 7.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవడంతో అక్కడ సందడి నెలకొంది. గంట ముందుగానే పరీక్షా కేంద్రంలోకి స్టూడెంట్లను అనుమతించారు. సీతంపేట పరిధిలో బుల్లయ్య కళాశాల, బీవీకే కళాశాల, శ్రీవిశ్వ కళాశాల, చైతన్య కళాశాల్లో ఇంటర్ పరీక్షలు జరిగాయి. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

22 నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు



శ్రీరామ నవమి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నారాయణరెడ్డి, వరప్రసాద్

మురళీనగర్: శ్రీరామ నవమిని పురస్కరించుకుని మురళీనగర్ రామాలయంలో ఈ నెల 22 నుంచి 30 వరకు వసంత నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈమేరకు గురువారం ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు టి.నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి సనపల వరప్రసాద్, కమిటీ సభ్యులు, అర్చక స్వాములు ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. వరప్రసాద్ మాట్లాడుతూ శ్రీరామనవమి వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. భక్తులకు ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సీతారాముల ఆలయ అర్చకుడు గొడవర్తి రఘురామాచార్యులు ఆధ్వర్యంలో ప్రతి రోజు స్వామికి వివిధ రకాల పుష్పాలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు అష్టోత్తర నామార్చన ఉంటుంది. ఈ నెల 26న ఉదయం 8 గంటలకు నీరాటోత్సవం నిర్వహించి సీతారాములను పెండ్లి కుమార్తె, కుమారులుగా అలంకరించి అర్చనాదికములు జరుపుతారు. ఈ నెల 30న ఉదయం 9 గంటలకు సీతారాముల కల్యాణం, సాయంత్రం 6 గంటలకు పట్టాభిషేకం దర్బార్ సేవ, పవళింపు సేవలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 2న అన్నదానం జరుగుతుంది.

రాములు కుటుంబానికి కె.కె.రాజు పరామర్శ



రాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కె.కె.రాజు, కంపా హనోకు

తాటిచెట్లపాలెం: ఇటీవల మరణించిన 45వ వార్డు ఏఎస్సార్ నగర్ కాలనీ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నల్లబోతుల రాములు కుటుంబ సభ్యులను గురువారం నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకులు పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన జ్ఞాపకార్థ కూడిక(సభ)లో పాల్గొన్న వీరు రాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఎస్సార్ నగర్ వాసుల ఇళ్ల కోసం రాములు చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, పార్టీ నాయకులు హరిపటాన్నయక్, రాజుయాదవ్, నానిబాబు, సన్యాసప్పలనాయుడు, నేపాల్ శ్రీను, నాయుడు, సన్నీ, బాబూరావు, ఆదిలక్ష్మి, సువర్ణలతోపాటు వామపక్ష నాయకుడు రవి తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ ఉద్యోగులకు ఎముక సాంద్రత పరీక్ష

మహారాణిపేట: కేజీహెచ్‌లో రెగ్యులర్, కాంట్రాక్ట్, సెక్యూరిటీ, శానిటేషన్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రెండు రోజులుగా ఉచిత ఎముక సాంద్రత పరీక్షలు నిర్వహిస్తున్నారు. 45 ఏళ్లు దాటిన మహిళలు, 55 ఏళ్లు దాటిన పురుషులకు ఈ పరీక్షలు చేశారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ఏఆర్‌ఎం డాక్టర్ జగదీష్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌కుమార్ 242 మందికి పరీక్షలు జరిపారు. డాక్టర్ పిఅశోక్‌కుమార్ మాట్లాడుతూ బోన్ డెన్సిటీ తగ్గితే ఎముకలు విరిగిపోవచ్చన్నారు. ఎముకల్లో కాల్షియం సాంద్రత తక్కువగా ఉంటే అలసట, నీరసానికి గురి కావడంతోపాటు ఎక్కువ దూరం నడవలేరన్నారు. అలాంటి వారు ఆకుకూరలు, మాంసాహారంతోపాటు కాల్షియం టాబ్లెట్లు తీసుకోవాలని సూచించారు.

వాసవీ క్లబ్ వితరణ



హ్యాండీక్యాప్డ్ ఇన్‌స్టిట్యూట్‌కు సామగ్రి అందిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

సీతంపేట: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా వాసవీ క్లబ్ అల్లిపురం శాఖ ఆధ్వర్యంలో గురువారం అక్కయ్యపాలెంలోని పావని మల్టీపుల్ హ్యాండీక్యాప్డ్ ఇన్‌స్టిట్యూట్‌లో మానసిక, మూగ, బధిర విద్యార్థులకు రూ.6 వేలు విలువ చేసే నాలుగు కుర్చీలు, వాకర్, వ్యాయామ బంతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ డి.వి.ఎస్.ఎన్.రాజు, పూర్వ అధ్యక్షుడు సీమకుర్తి విఠల్‌కుమార్, రీజనల్ చైర్‌పర్సన్ వారిగాల పండు, కార్యదర్శి బి.వి.ఎల్.కుమార్, కోశాధికారి పి.వి.ఎస్.ఆర్.గుప్తా, సుబ్రహ్మణ్యం, దాసు విజయ కుమార్, డి.వి.ఆర్.గుప్తా, వంకాయల రవి, దాసు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా బీటీ రోడ్ల నిర్మాణం



కప్పరాడ కూడలిలో నిర్మిస్తున్న బీటీ రోడ్డు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కంచరపాలెం పరిధి జాతీయ రహదారి నుంచి కప్పరాడ మీదుగా రాంజీ ఎస్టేట్, అంబేడ్కర్ ఎస్టేట్, అరుంధతి నగర్, జైప్రకాశ్‌నగర్, పెదకొత్తూరు, బాపూజీనగర్, తిక్కవానిపాలెం కాలనీ వరకు వెళ్లే ప్రాంతాల్లోని అనుసంధాన మార్గాల్లో వీటిని నిర్మిస్తున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.వి.జి.కృష్ణ ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ ఈఈ శ్రీనివాసరావు, డీఈ భరణికుమార్‌ల పర్యవేక్షణలో బీటీ రోడ్ల పనులు వేగవంతం చేశారు. ఆయా ప్రాంతాల్లో వాహనాలను దారి మళ్లించినట్లు అధికారులు తెలిపారు.

ముగిసిన శిక్షణ తరగతులు



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న యువజన కాంగ్రెస్ సభ్యులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీలోని హోటల్ సింకా గ్రాండ్‌లో బుధవారం ప్రారంభమైన కాంగ్రెస్ యువజన విభాగం శిక్షణ తరగతులు రెండో రోజు గురువారం సాయంత్రంతో ముగిశాయి. కాంగ్రెస్ పార్టీ, నాయకులు దేశానికి చేసిన సేవలను, స్వాతంత్ర్యానంతరం నాటి పరిస్థితులను ఈ సందర్భంగా తెలియజేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చి పాల్గొన్న యువజన కాంగ్రెస్ సభ్యులందరికీ ప్రశంసాపత్రాలను రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి, నగర అధ్యక్షుడు గొంప గోవిందరాజు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ సిస్టంను పరిశీలించిన సీపీ



స్కాడా వాటర్ మానటరింగ్ సిస్టం వద్ద పోలీస్ కమిషనర్ శ్రీకాంత్, అధికారులు

మర్రిపాలెం: ఈ నెల 28, 29 తేదీల్లో విశాఖలో జరగనున్న జీ-20 సదస్సు నేపథ్యంలో ఆర్ అండ్ బీ జంక్షన్ ప్రాంతంలో గురువారం నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఆకస్మికంగా పర్యటించారు. అక్కడి గ్రీన్‌బెల్ట్ దరి ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన స్కాడా 24/7 వాటర్ మానిటరింగ్ సిస్టంను, రవాణా కార్యాలయం సమీపంలోని పంప్ హౌస్‌ను ఆయన పరిశీలించారు. జీ-20 సదస్సుకు సంబంధించి డెలిగేట్స్ నగరానికి రానున్న నేపథ్యంలో సీపీ పర్యటించినట్టు సమాచారం. స్కాడా పనితీరును డెలిగేట్స్ పరిశీలించనున్న నేపథ్యంలో వారి భద్రత దృష్ట్యా స్కాడా వాటర్ మానిటరింగ్ సిస్టంను ఆర్‌టీఏ కార్యాలయ సమీపంలోని పంప్‌హౌస్‌లో ఏర్పాటు చేసే విధంగా ప్రతిపాదన చేసినట్టు తెలిసింది. ఈమేరకు జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులు సమావేశమయ్యారు. పంప్‌హౌస్‌లో స్కాడా సిస్టం సాధ్యా అసాధ్యాలపై చర్చిస్తునట్టు తెలిసింది. సీపీ వెంట డీసీపీ-2 ఆనందరెడ్డి, వెస్ట్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, ట్రాఫిక్ ఏసీపీ భీమారావు, ఎయిర్‌పోర్టు సీఐ బీఎండీ ప్రసాద్, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్లు



వాకర్స్ పార్కులో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సత్యనాథం, చంద్రమౌళి

సీతమ్మధార: గురుద్వారాలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు చిత్రపటానికి సంస్థ డైరెక్టర్లు బి.రమేష్‌ప్రసాద్, డి.చంద్రం, ఎ.వి.వి.సూర్యప్రతాప్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ హెచ్‌ఆర్‌డీ చీఫ్ జనరల్ మేనేజర్ డి.సుమన్ కల్యాని, జె.శ్రీనివాసరావు, ఎం.రవీంద్ర, జనరల్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి

మురళీనగర్: ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి అమరుడైన పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి సత్యనాథం అన్నారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఆధ్వర్యంలో గురువారం వాకర్స్ పార్కులో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం సాధించామని, నేటి యువత త్యాగధనుల చరిత్రను తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. చంద్రమౌళి మాట్లాడుతూ దేశ భక్తి, త్యాగం, సత్యం, సామాజిక సేవా దృక్పథాలను యువతకు అలవడేలా వారి కుటుంబ సభ్యులతోపాటు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ధ్యాన మందిరంలో సేవా కార్యక్రమాలు



భక్తులకు కంటి వైద్య పరీక్షలు చేస్తున్న మ్యాక్సివిజన్ ఆస్పత్రి సిబ్బంది

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా ఉన్న షిర్డీసాయిబాబా. ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి బాబాకు పూజలు, అభిషేకాలు జరిపి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మ్యాక్సివిజన్ ఐ హాస్పిటల్ వారి సౌజన్యంతో ధ్యాన మందిర ప్రాంగణంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 200 మంది భక్తులకు, పేదలకు వైద్య పరీక్షలు చేసి కంటి సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అత్తిలి బాల సమీర 6వ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు మధ్యాహ్నం మందిరం వద్ద అన్నదానం నిర్వహించారు. సాయంత్రం నుంచి హారతులు, బాబా భజన, పల్లకీ సేవ కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో మ్యాక్సివిజన్ క్యాంప్ కౌన్సెలర్ రుషిక, ఆప్టోమెట్రిస్ట్ పృథ్వీరాజ్, ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డును ఆక్రమించి పనులు



బాలయ్యశాస్త్రి లేఅవుట్ రోడ్డులో భవన నిర్మాణ సామగ్రి

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్లను ఆక్రమించి భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని రోడ్డు మధ్యలో భవన నిర్మాణదారులు ఇసుక, పిక్క అడ్డంగా వేసి పనులు చేయిస్తుండటంతో రాకపోకల సమయంలో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

వై20 నాలుగు రాష్ట్రాల ఇన్‌చార్జిగా వంశీయాదవ్



మర్రిపాలెం: బీజేపీ యువమోర్చా నిర్వహించే యూత్ ఎంగేజ్‌మెంట్ గ్రూప్ వై20 నాలుగు రాష్ట్రాల ఇన్‌చార్జిగా మురళీనగర్‌కు చెందిన ఉప్పిలి వంశీయాదవ్ నియమితుడయ్యారు. బీజేపీ జాతీయ యువమోర్చా అధ్యక్షుడు తేజస్వీ సూర్య ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా వై20 చౌపల్స్ అనేక కార్యక్రమాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. దీనికి సంబంధించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ రాష్ట్రాలకు ఏపీ విశాఖ నుంచి ఆయనను జాతీయ నాయకత్వం గురువారం నియమించింది. ఈ సందర్భంగా వంశీయాదవ్ మాట్లాడుతూ వై20 జాతీయ అధ్యక్షుడు తేజస్వీ తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. కేంద్ర యువజనుల మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో జీ20 సభ్య దేశాలకు ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షత వహిస్తున్న నేపథ్యంలో వై20 చౌపల్స్ ద్వారా భారత్‌ను విశ్వగురువుగా చేసే లక్ష్యంతో దేశవ్యాప్తంగా ఉన్న యువతను భాగస్వామ్యం చేస్తామన్నారు. గ్రామాలు, విద్యాలయాలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, అకడమిక్ ట్రైనింగ్ సెంటర్లు, స్పోర్ట్ కాంప్లెక్స్‌ల్లో ఇలా యువత ఉన్న ప్రతి చోట సమావేశాలు నిర్వహించి వారి సలహాలు, సూచనలు తీసుకుంటామని చెప్పారు. జీ20 అధ్యక్షతపై భారత్ బాధ్యత, భవిష్యత్తు ప్రణాళికలు తదితర అంశాలపై వై20 బ్యానర్ ద్వారా తన బాధ్యతగా నాలుగు రాష్ట్రాల్లో 600 చౌపల్స్ సమావేశాలు ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు తెలిపారు.

మహారాజశ్రీ 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు
విశాఖపట్నం
E.P.No. 9/2016 in O.S. No. 337/2012
బిట్వీన్ :
పాసి అప్పారావు - డిక్రీ హోల్డర్
అండ్
మల్లినేని భాస్కరరావు - జడ్జిమెంట్ డెటార్
వేలం ప్రకటన
పై నెంబరు అమలు పిటీషనులో డిక్రీ బాకీ మరియు ఖర్చులు రాబట్టు నిమిత్తము పై జడ్జిమెంటు డెటారు యొక్క ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని తేది. 04.04.2023దినమున శ్రీ కోర్టు వారు వేలం ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున పై దినమున ఉదయం గంటలు 10:30 నిమిషములు నుండి సాయంత్రం 5:00 గంటల మధ్య సమయంలో బహిరంగ వేలం వేయుదురు. కావున సదరు వేలము పాటలో పాల్గొనుటకు ఆసక్తి గలవారు పైన ఉదహరించిన తేదీన తెలిపిన ప్రకారము శ్రీ కోర్టువారి ఎదుట ఉదయం 10:30 నిమిషములకు హాజరుకాగలరని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.
షెడ్యూలు ఆస్తి వివరములు :
గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ మరియు సబ్ రిజిస్ట్రార్ విశాఖపట్నం పరిధిలో గల సీతమ్మపేట ఏరియా (రాజేంద్రనగర్ ఏరియాలో), సర్వే నెం. 33/1లో ప్లాటు నెంబరు 50 & 54 గా గుర్తించబడిన నివాస స్థలములో అవిభక్త మరియు అవిభాజ్యపు నగ భాగము మరియు 1600 చ॥అ॥ విస్తీర్ణము, గ్రౌండు ఫ్లోరులో కట్టబడిన ఆర్.సి.సి.ఇల్లు, డోర్ నెంబరు 50-62-4/8, ఇంటిపన్ను అసెస్‌మెంట్ నెం. 48036. (పాతది) 1086110065 (కొత్తది) మరియు ఎలక్ట్రిక్ మీటర్లతో సహా అన్ని హంగులు కలిగిన నివాస గృహమునకు హద్దులు : తూర్పు : వి.వరలక్ష్మి మరియు వరహాలుకు చెందిన ప్లాటు నెంబరు 51 స్థలము దక్షిణం : కె.సూర్యనారాయణ గారి ఆస్తి, పడమర : రోడ్డు, ఉత్తరం : రోడ్డు
డిక్రీ హోల్డరు విలువ : రూ. 70,00,000
అమీన్ విలువ : రూ. 1,06,80,000
(By the order of Hon'ble Court)
T.RAVI KUMAR, Advocate
LIG No. 38, D.No.10-53-304,
Ram Nagar, Visakhapatnam.
Cell : 9346424173
Visakhapatnam
Dt.16.03.2023

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణం, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com